సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 13, మే, 2024

సజావుగా పోలింగ్ సామగ్రి పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ ఆదివారం సజావుగా జరిగింది. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ పంపిణీ చేపట్టారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఈ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ సిబ్బంది ఉండేందుకు టెంట్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, భోజన వసతులు కల్పించడం, సిబ్బంది, సామగ్రితో పోలింగ్ స్టేషన్‌కి చేర్పించేందుకు బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో సకాలంలో వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



ఓటు వజ్రాయుధం

ఆమదాలవలస రూరల్: ఎన్నికల్లో అంతా ఓటేయాలని పిలుపునిస్తూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ శిల్పాన్ని తీర్చిదిద్దారు. గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద శిల్పాన్ని రూపొందించి అంతా ఓటేయాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్లపై నిషేధం

హిరమండలం: పోలింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్లు, కార్డ్‌లెస్, వైర్‌లెస్ సెల్ల ఫోన్లపై నిషేధం విధించారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలోకి ఇలాంటివి తీసుకెళ్లకూడదు. పోలింగు బూత్‌లో ఓటు వేస్తూ సెల్ఫీలు తీసుకోవడానికి సైతం వీల్లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కేవలం ఎన్నికల పరిశీలకులు, సూక్ష్మపరిశీలికులు, ప్రిసైడింగ్ అధికారులు, భద్రతా అధికారులు మాత్రమే ఫోన్లు తీసుకువెళ్లవచ్చని, వాటిని కూడా సైలెంట్ మోడ్‌లో ఉంచాలని సూచించారు.

- జిల్లాను అన్ని రకాలుగా ఆదుకున్న సీఎం వైఎస్ జగన్
- రూ. వేల కోట్లతో అభివృద్ధి పనులు

నమ్మకాన్ని గెలిపిద్దాం



జిల్లాలో ఏదైనా ఊరికి వెళ్తే కొత్తగా కనిపించే సచివాలయ భవనం, ఆ పక్కనే రైతు భరోసా కేంద్రం, అక్కడకు కొన్ని అడుగుల దూరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్.. ఐదేళ్ల ముందు ఈ దృశ్యాలేవీ లేవు. అప్పట్లో పేదలు రేషన్ కోసం డీలరు దుకాణం ముందు దీనంగా నిలుచునే వారు. రైతులు విత్తనాల కోసం ఆశగా ఎదురు చూసేవారు. సామాన్యులు పింఛన్ల కోసం నాయకుల ఇంటి చుట్టూ తిరిగేవారు. కానీ ఐదేళ్ల పాలనలో ఈ అవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మటుమాయం చేసింది. సామాన్యుల ఆత్మగౌరవం కాపాడేలా అధికారులు, నాయకులనే ఇంటికి పంపించింది. అర్హత ఉంటే చాలు ఎవరినీ బతిమలాడాల్సిన అగత్యం లేకుండా సంక్షేమాన్ని చేరువ చేసింది. ఇది కదా సామాన్యుడు కోరుకునే అభివృద్ధి.

జలయజ్ఞంకు ఊపిరి



ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పరుగులు తీస్తున్నాయి. వంశధార ఫేజ్ 2లోని స్టేజ్ 2పనులు పూర్తి చేయడమే కాకుండా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈలోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మంజూరు చేశారు. రూ. 176.35కోట్లు మంజూరు చేయడమే కాకుండా ఇటీవల శంకుస్థాపన కూడా చేశారు. 26వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు మహేంద్రతనయ వద్ద రూ. 852.45కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారు.

ఉద్దానం కోసం





పలాసలో రూ.80కోట్లకు పైగా వ్యయంతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటర్, అతిపెద్ద డయాలసిస్ సెంటర్‌ను నిర్మించారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరుగా భావిస్తున్న నేపథ్యంలో 807గ్రామాలకు ఉపరితల రక్షిత మంచినీరు అందించేందుకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మించారు.

మత్స్యకార సంక్షేమం, ఎగుమతుల అభివృద్ధి కోసం

సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న జిల్లాలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు మూలపేట పోర్టు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మత్స్యకారుల కోసం రూ. 365.81కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని నీళ్లపేటలో రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు. దానిని ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేసి, పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.

గ్రామ స్వరాజ్యం



గత ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా, పింఛను రావాలన్నా సంవత్సరాలు తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామస్వరాజ్యమేంటో చేసి చూపిస్తోంది. 2019 నుంచి రాష్ట్రంలో సరికొత్త పరిపాలనకు నాంది పలుకుతూ గ్రామ సచివాలయాల వ్యవస్థను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో కనీసం 100 ఇళ్లకు, గ్రామాల్లో కనీసం 50 ఇళ్లకు ఒక సచివాలయం పేరిట ఈ వ్యవస్థకు పక్కా మార్గదర్శకాలతో ఉద్యోగులకు విధులు కేటాయించారు. ఈ సచివాలయాలు సామాన్యుల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాయి.

ఉద్యోగాల కల్పన



సచివాలయాల ఏర్పాటు ద్వారా 7,880 మందికి ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రతి పీహెచ్‌సీకి అదనంగా ఒక్కో డాక్టర్‌ను నియమించారు. దీంతో 66 మందిని కొత్తగా నియమించారు. అలాగే వివిధ రకాల హోదాల్లో పీహెచ్‌సీల్లో, 108, 104 వాహనాల్లో కొత్తగా పనిచేసేందుకు కొత్తగా 2199 మందిని నియమించారు. ఊరూరా కొలువైన సచివాలయాల్లో 6వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు.

గ్రామస్థాయిలోనే వైద్యసేవలు



సచివాలయాల్లో భాగంగా ఉండే విలేజి హెల్త్ క్లినిక్స్‌తో అద్భుత సేవలు క్షేత్ర స్థాయిలో సామాన్య, పేద వర్గాలకు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించే అద్భుత కార్యక్రమం హెల్త్ క్లినిక్‌ల సేవల్లో భాగంగానే నిర్వహిస్తున్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచితంగా మందుల పంపిణీ, ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడమే కాకుండా వారికి సర్జరీలు, ఉన్నత మెరుగైన వైద్యం అందేలా కూడా అధికారులు చర్యలు చేపట్టారు.

వైఎస్ జగన్ సీఎం అయితే ఏమవుతుంది..?	చంద్రబాబు సీఎం అయితే ఏమవుతుంది..?
నిరుపేదలకు సంక్షేమ పథకాలు సజావుగా అందుతాయి.	పేదలను ఆదుకుంటున్న పథకాలన్నీ ఆగిపోతాయి.
జగన్‌కు ఓటేస్తే ఏమవుతుంది.? ఒకటో తేదీకే వలంటీర్లు పింఛన్లు ఇంటికి తెచ్చి ఇస్తారు.	**బాబుకు ఓటేస్తే ఏమవుతుంది..?** పింఛన్ కోసం మళ్లీ లైనుల్లో నిలుచోవాల్సి వస్తుంది.
జగన్‌కు మద్దతిస్తే ఏమవుతుంది..? అర్హత ఉంటే చాలు సంక్షేమం అందుతుంది.	**బాబుకు మద్దతిస్తే ఏమవుతుంది..?** ప్రతి చిన్న పనికీ మళ్లీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వస్తుంది.
జగన్ గెలిస్తే ఏమవుతుంది..? సచివాలయం, ఆర్‌బీకేలు బలపడతాయి. గ్రామ స్వరాజ్యం వర్ధిల్లుతుంది.	**బాబు వస్తే ఏమవుతుంది...** సచివాలయ వ్యవస్థ ధ్వంసమవుతుంది. టీడీపీ నాయకులు మళ్లీ దోపిడీ వ్యవస్థకు తెర తీస్తారు.

మనసున్న మారాజుకే జై కొట్టండి

జిల్లాలో ఏ ఇద్దరు కలిసి మాట్లాడుకున్నా ఇదే టాపిక్. ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఇది. బడుగు బలహీన వర్గాలకు సంక్షేమం అందించిన జగన్ ఎక్కడ, వారి వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేని బాబు ఎక్కడ అని మాట్లాడుకుంటున్నారు. ఐదేళ్ల పాలనలోనే గ్రామ స్వరాజ్యాన్ని సాధించిన వైఎస్ జగన్ ఎక్కడ, 14 ఏళ్లు పాలించినా గొప్పలు చెప్పకోవడం తప్ప శ్రీకాకుళంలో ఒక్క మంచి పనిచేశానని చెప్పకోలేని బాబు ఎక్కడ అని చర్చించుకుంటున్నారు. ఏ ఊరికి వెళ్లి చూసినా ఈ ఇద్దరి పాలనకు తేడాలు ఇట్టే కనిపిస్తాయని అంటున్నారు.

- ఇద్దరి పాలనను బేరీజు వేయండి
- ఎవరు మేలు చేశారో గుర్తించండి
- టీడీపీ గత పాలనలో ఎదుర్కొన్న కష్టాలు గుర్తు చేసుకోండి
- విజ్ఞతతో మంచికే ఓటు వేయండి
- సుఖమయమైన భవిష్యత్తుకు బాట వేసుకోండి

- సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- ఏం చూసి టీడీపీకి ఓటేయాలంటున్న ప్రజలు
- అధికారంలో ఉండగా రెచ్చిపోయిన ఇసుక, మైనింగ్ మాఫియా

నయవంచనకు చెక్ పెడదాం



టీడీపీ జిల్లాకు చేసిన మంచి ఏమైనా ఉందా..? శాశ్వత ప్రాజెక్టు ఏమైనా కట్టిందా..? పేదల కష్టాలు తగ్గించే పథకాలేవైనా తెచ్చిందా..? లేనే లేదు. మరి నీకెందుకు ఓటెయ్యాలి బాబూ అని శ్రీకాకుళం ప్రజ లు ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాల కాలం పదవులు అనుభవించినా జిల్లాకు మంచి చేయని నాయకులకు ఈసారి ఓటేసేది లేదని తెగేసి చెబుతు న్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 కాలంలో అవినీతి అక్రమాలు, భూ కుంభకోణా లు, ఇసుక, మైనింగ్ దందాలు పెద్ద ఎత్తున చేశారు. కనిపించిన భూములన్నీ ఆక్రమించేశారు. అందుకే నిన్ను నమ్మం బాబు అని బహిరంగంగా జనం చెబుతున్నారు.

దోపిడీ పర్వం ఇలా..



- టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు రూ.1500కోట్లకు పైగా స్వాహా చేశారు. వీరి దెబ్బకు నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, బాహుదా నదులు టీడీపీ హయాంలో బక్కచిక్కిపోయాయి. కింజరాపు అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు, కూన రవికుమార్, దేవినేని ఉమామహేశ్వరరావు, సీఎం రమేష్ తదితరులు దోచుకుతిన్నారు.
- 2014-19లో రూ. 300కోట్ల వరకు జిల్లాలో మైనింగ్ అక్రమ తవ్వకాలు జరిపి టీడీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు. జీఎస్టీలు ఎగ్గొట్టి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. ఇందులో టీడీపీ నేతలు కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబీకులు, దేవినేని ఉమామహేశ్వరరావు, కళా వెంకటరావు, సీఎం రమేష్, చౌదరి బాబ్జీ కుటుంబీకులు, అనుచరుల ప్రమేయం ఉన్నట్టు విజిలెన్స్ విచారణలో సైతం తేలింది.
- గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సన్నిహితంగా ఉన్న సీఎం రమేష్‌కు చెందిన రుత్విక్ సంస్థ మెటల్, గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు చేపట్టింది. 7,774 క్యూబిక్ మీటర్ల మెటల్ అక్రమంగా తవ్వినట్టు గుర్తించి, 83,57,050 జరిమానా విధించారు. 52,774 క్యూబిక్ మీటర్లు అక్రమంగా తవ్వడంతో కోటి 42లక్షల 48వేల 490మేర జరిమానా వేశారు. అలాగే, ఏ లీజు లేకుండా అక్రమంగా తవ్వినందుకు రూ. 5లక్షలు వంతున రూ.10లక్షలు వెరసి రూ.2.36 కోట్లు మేర పెనాల్టీ వేసి నోటీసు జారీ చేశారు.
- వృథాగా పోతున్న నీటిని పంటలకు ఉపయోగించేందుకు గెడ్డలు, చెరువుల్లో నీరు-చెట్టు పథకం కింద చేపట్టిన పనుల్లో వందల కోట్ల నిధులు మింగేశారు. వ్యవసాయ ఆధునీకరణలో భాగంగా గత ప్రభుత్వం అమలు చేసిన రైతు రథం ట్రాక్టర్ల విషయంలో అదే జరిగింది.
- కేంద్ర ప్రభుత్వం వెనకబడిన ప్రాంతాల కింద మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ ప్యాకేజీ(ఎస్‌డీపీ) నిధులు కూడా టీడీపీ నాయకులు తినేశారు. ఆ ఐదేళ్ల కాలంలో రూ. 222.63కోట్లు మంజూరవ్వగా ఆ పనులు చేస్తామంటూ మింగేశారు.
- పేద వాడికి సెంటు స్థలం ఇవ్వని చంద్రబాబు.. తన హయాంలో శ్రీకాకుళం 80అడుగుల రోడ్డులో ఎన్నో ఏళ్ల క్రితం దళితుల సంక్షేమం కోసం సేకరించి ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన భూమిపై కన్నేసి కొట్టేశారు. పార్టీ కార్యాలయం కోసం రూ. 80కోట్ల విలువైన రెండెకరాల భూమిని 99 సంవత్సరాలకు లీజు కింద తన పార్టీకి కట్టబెట్టేశారు.

నేడే పోలింగ్



- జిల్లాలో 18,75,934 మంది ఓటర్లు
- గ్రామాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

ఎన్నికల సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లు	2358
సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు	520
షాడో పోలింగ్ స్టేషన్లు	36
పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన బృందాలు	115
పోలింగ్ సిబ్బంది	362 మంది
పోలింగ్ అధికారులు	5647
అదర్‌పోలింగ్ సిబ్బంది	1128
మైక్రో పరిశీలకులు	671
రూట్ అధికారులు	268
కంట్రోల్ రూముల్లో సిబ్బంది	72
వెబ్ కాస్టింగ్ జరిగే కేంద్రాలు	1626
అదనపు కెమెరామెన్‌లు	333
దివ్యాంగుల కోసం కుర్చీలు	1800
ఈవీఎం, వీవీ ప్యాట్‌లు	15,228

భద్రతా సిబ్బంది

సివిల్ పోలీసులు	1244
హోమ్ గార్డులు	365
స్టేట్ ఆర్మ్‌డ్ పోలీసులు	44 కంపెనీలు
సెంట్రల్ ఆర్మ్‌డ్ సిబ్బంది	11 కాయిల్స్
ఎక్స్ సర్వీస్ మెన్	264
ఎన్‌సీసీ	335
ఎన్ఎస్ఎస్	954

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయం రానే వచ్చేసింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2358 పోలింగ్ స్టేషన్లలో 18,75,934 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం ఉదయం నుంచి అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ సామగ్రి పంపిణీ జరిగింది. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో వారికి కేటాయించిన బస్సుల్లో నిర్దేశించిన ప్రదేశాలకు వెళ్లారు. వీరు వెళ్లిన వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 44,000 మంది సిబ్బంది ఎన్నికల కోసం పనిచేస్తున్నారు.

ఈ ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 73 మంది బరిలో ఉన్నారు. ఇచ్ఛాపురంలో 9 మంది, పలాసలో 10 మంది, టెక్కలిలో ఏడుగురు, పాతపట్నంలో 10 మంది, శ్రీకాకుళంలో ఏడుగురు, ఆమదాలవలసలో 13 మంది, ఎచ్చెర్లలో 10 మంది, నరసన్నపేటలో ఏడుగురు పోటీ పడుతున్నారు.



పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



శ్రీకాకుళంలో పోలింగ్ కోసం సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది



బ్యాలెట్ బాక్స్ నంబర్లను సరిచూసుకుంటున్న అధికారులు



పారామిలటరీ సిబ్బంది

క్లుప్తంగా

శ్రీశయనులను గుర్తించింది జగనన్న ప్రభుత్వమే


డి.పి.దేవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో కల్లుగీత కార్మికులుగా ముద్ర పడి ఏ విధమైన అభివృద్ధికి, గుర్తింపునకు నోచుకోలేని తమ జాతిని గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌తో పాటు ఐదుగురు డైరెక్టర్లుగా ఇచ్చి ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌ని నియమించి శ్రీశయనుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో కూడా శ్రీశయన కులస్తులకు గుర్తింపునిచ్చింది లేదన్నారు. ధర్మాన చొరవతో జిల్లా మార్కెట్ కమిటీలో వైస్ చైర్మన్ పదవి, జిల్లా డ్వాక్రా మహిళల అధ్యక్ష పదవి, రిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ పదవి, అరసవిల్లి దేవాలయం కమిటీ సభ్యునిగా ఒకరికి ఇలా అనేక మందికి గుర్తింపునిచ్చి సమాజంలో గౌరవం కల్పించింది వైఎస్సార్‌సీపీయేనని చెప్పారు. శ్రీశయనులంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ నేత కాకర్ల మృతికి సంతాపం


కాకర్ల పైడిలింగం(ఫైల్)

పొందూరు : పొందూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కాకర్ల పైడిలింగం ఆదివారం తన నివాసంలో మృతి చెందారు. ఆయన వయస్సు 81 ఏళ్లు. ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కాకర్ల రాజారావు శ్రీశైలం దేవస్థానం దేవాంగ సత్రం డైరెక్టర్‌గా, కోడలు కాకర్ల చల్లమాంబ ప్రస్తుత వైస్ ఎంపీపీగా ఉన్నారు. కాకర్ల పైడిలింగం ప్రజాసేవలో ముందుండేవారు. ఏటా 2500 మందికి వస్త్రదానం చేస్తుంటారు. స్థానిక దేవాంగుల కాలనీలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి 400 గజాల స్థలాన్ని, దేవాంగ సామాజిక భవన నిర్మాణానికి 150 గజాల స్థలాన్ని ఉదారంగా దానం చేశారు. పైడిలింగం మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

మండల సర్వేయర్ మృతి


చింత మహేష్(ఫైల్)

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన చింత మహేష్ (40) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన విజయనగరం జిల్లా రేగిడి మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం విరోచనాలు ఎక్కువగా అవడంతో కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మహేష్‌కు భార్య స్వాతి, ఇద్దరు కుమార్లు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి


ఆదిశంకరాచార్యుని జయంతి వేడుకల్లో ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యుని జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు శంకరాచార్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. శంకరాచార్యుని ఆదర్శనీయతను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, బి.ఎస్.చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉజ్జడి బండి ఊరేగింపు


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట వద్ద వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మతల్లి పెద్ద పండగలు సందర్భంగా ఆదివారం ఉజ్జడి బండి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఉజ్జడి బండిని ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు బండి నిండుగా ప్రసాదాలను సమర్పించారు. గ్రామ పొలిమేర వరకు తీసువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరికి దిష్టిదోషం లేకుండా అమ్మవారికి బలిదానం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 28 వరకు అమ్మవారి పండగలు జరుగుతాయని పేర్కొన్నారు.

మహిళా మేలుకో..!

- జగనన్న పాలనలోనే మహిళాభ్యున్నతి
- చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ రాయితీ, అమ్మఒడి తదితర పథకాలతో లబ్ధి



శ్రీకాకుళం పాతబస్టాండ్ :మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిన చంద్రబాబు ఎన్నికల సమయంలో మాత్రం ఎక్కడా లేనన్ని హామీలు గుప్పిస్తుంటారు. అధికారంలోకి రాగానే అమలు చేయకుండా పక్కన పెట్టేస్తారు. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఇదే పరిస్థితి పునరావృతమయ్యేది. 2019 ఎన్నికల్లో ఇలాగే హామీలతో ముందుకొచ్చిన బాబును మహిళలు ఓటుతో బుద్ధి చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళా సంక్షేమం కోసం జగనన్న అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. సంక్షోభాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నా వడ్డీ రాయితీ, అమ్మఒడి తదితర పథకాలు విజయవంతంగా అమలు చేసి అండగా నిలిచారు. మళ్లీ ఎన్నికలు వచ్చినందున ప్రతి మహిళా కృతజ్ఞత చాటిచెప్పాల్సిన సమయం వచ్చింది.

కాపునేస్తం

45 నుంచి 60 మధ్య వయసు గల కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు కాపు నేస్తం పేరిట ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రతి లబ్ధిదారుకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం నేరుగా డీబీటీ విధానం ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

లబ్ధిదారులు	నిధులు
18,801	రూ.28.20 కోట్లు

వైఎస్ఆర్ చేయూత

మహిళల అభ్యున్నతికి వైఎస్సార్ చేయూత ఎంతగానో ఉపయోగపడుతోంది. 45 నుంచి 60 మధ్య వయస్సు గల వారు ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ వర్గాల మహిళలకు ఏటా రూ.18750 చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేశారు. ఈ ప్రోత్సాహంతో మహిళలు స్వయం శక్తితో ఎదగడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

లబ్ధిదారులు	నిధులు
4,79,271	రూ. 889.54 కోట్లు

ఈబీసీ నేస్తం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈబీసీ నేస్తం పథకం.. అగ్రవర్ణాలైన బ్రాహ్మణ, ఇతర కులాల పేదలకు ఆర్థిక సాయం అందించే ఈ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవంతంగా అమలు చేశారు. దీంతో అగ్రవర్ణాల పేదలకు ఎంతగానో ప్రయోజనం కలిగింది.

లబ్ధిదారులు	నిధులు
4994 మంది	రూ.7.4 కోట్లు

సున్నా వడ్డీ రాయితీ

మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకుల నుంచి వాడిన రుణానికి వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లించే విధానం విజయవంతంగా అమలు చేశారు. దీంతో సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని క్రమంగా వాయిదాలతో అప్పును చెల్లిస్తుండటంతో వడ్డీని భరిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు గడిచిన నాలుగున్నరేళ్లలో నాలుగుసార్లు సున్నా వడ్డీ మాఫీ అందజేశారు.

లబ్ధిదారులు	నిధులు
5,92,014	రూ. 175 కోట్లు

అమ్మఒడి

బడికి పిల్లలను పంపే ప్రతి తల్లి ఖాతాకు ఏటా రూ.15 వేలు చొప్పున జగనన్న ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద అందజేస్తోంది. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా తల్లి ఖాతాకు నేరుగా నిధులు జమ చేస్తోంది.

లబ్ధిదారులు	నిధులు
865452	రూ.1298.51 కోట్లు

ఇంటింటికీ వెండిభరిణి, వెయ్యి నగదు!


గుజరాతీపేటలో నగదు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


రూ.వెయ్యి నగదు, వెండి భరిణీ

ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఇంటింటికీ రూ.వెయ్యి నగదు, రూ.1500 విలువైన వెండి భరిణిలు గుట్టు చప్పుడుగా కాకుండా పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇక్కడ కూటమి అభ్యర్థిగా గౌతు శిరీష పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్నిచోట్ల ఇంటింటికీ కేజీ, అర కేజీ చొప్పున చికెన్ సైతం పంపిస్తున్నట్లు భోగట్టా.

విచ్చలవిడిగా నగదు పంపిణీ..

శ్రీకాకుళం: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలంటూ ఆ పార్టీ కార్యకర్తలు ఓటర్లను ప్రలోభ పెడుతూ విచ్చలవిడిగా నగదు పంపిణీ చేశారు. శనివారం నుంచి నగదు పంపిణీ ప్రక్రియప్రారంభం కాగా ఆదివారం సాయంత్రం రోడ్లపైనే ఓటర్లకు నగదు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేశారు. ఒక్కొక్క ఓటుకు రూ.2వేలు నుంచి రూ.3వేల వరకు నగదు పంపిణీ చేస్తున్నట్లు పలువురు ఓటర్లు చెబుతున్నారు. మద్యం పంపిణీ కూడా ఇష్టారాజ్యంగా అందజేశారు. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీకి పిర్యాదు చేయనున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం తెలిగిపెంట పంచాయతీ ఎల్.పి.ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆమదాలవలస స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం అసెంబ్లీ అభ్యర్థి తమ్మినేని సీతారాం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెవర మల్లేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న తమ్మినేని సీతారాం

అరసవల్లిలో వైశాఖ సందడి


ఇంద్ర పుష్కరిణి వద్ద సంప్రదాయ పూజలు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో వైశాఖ మాసం సందడి ప్రారంభమైంది. తొలి ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు కుటుంబాలతో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయంగా వస్తున్న తొలి పంట ఫలాలను, మామిడి పండ్లు, చలిమిడి, బెల్లం, పెసల మొలకలు, గోధుమ ప్రసాదాలను ఆదిత్యునికి నివేదించి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టగా.. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో ఎస్.చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3,74,300, పూజలు, విరాళాల ద్వారా రూ.67,036, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు.


ప్రత్యేక దర్శన మార్గంలో భక్తుల రద్దీ

చెరువులో పడి ఇద్దరు మృతి

ఇచ్ఛాపురం రూరల్: చెరువులో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళతో పాటు ఆమెను కాపాడబోయిన మరొక వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. బిర్లంగి గ్రామానికి చెందిన సబిత రౌళో (49) దుస్తులు ఉతికేందుకు తన మనువడ్ని తీసుకొని గ్రామం పొలిమేరలో ఉన్న చెరువు వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. అక్కడే ఉన్న మనవడు సైతం చెరువులోకి దిగడంతో అటువైపుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన దూపాన భైరి(70) వెంటనే చెరువులోకి దూకి బాలుడ్ని రక్షించారు. మళ్లీ సబిత రౌళోను రక్షించే ప్రయత్నంలో ఆమెతో పాటు చెరువులో మునిగిపోయాడు. బాలుడు గట్టిగ కేకలు వేయడంతో స్థానికులు వెంటనే చెరువులోకి దిగి అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దర్నీ ఒడ్డుకు చేర్చారు. హుటాహుటిన ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ బగ్గ రవి కుమార్ తెలిపారు.


సబిత మృతదేహం


దూపాన భైరి మృతదేహం

ఒడిశా మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

టెక్కలి రూరల్: మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన కొర్ను రవికుమార్ అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి మద్యం తీసుకొస్తూ తిర్లంగి గ్రామం వద్ద ఎస్ఈబీ అధికారులను చూసి పరిగెత్తడంతో అధికారులు వెంబడించి పట్టుకున్నారు. సంచిలో 96 ఒడిశా మద్యం బాటిళ్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.ఎస్.రాజశేఖరనాయుడు తెలిపారు.

1920 మద్యం బాటిళ్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల బాక్సులతో సెబ్ పోలీసులు


కొత్తూరు: కొత్తూరు మండలం కుంటిభద్ర సమీపంలో వంశధార నది ఒడ్డున టీడీపీ వర్గీయుల నుంచి ఒడిశా చెందిన 1920 మద్యం బాటిళ్లను సెబ్ సీఐ బి.జయరాం రెడ్డి , ఎస్ఐ కె.శ్రావణిలు సిబ్బందితో కలిసి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.30445 లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు. పట్టుకున్న మద్యం నిల్వలను పలాస అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అరా బేగం పరిశీలించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

ఆమదాలవలస: ఎన్నికల విధుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో 33 రూట్లలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 118 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు, 35 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 205 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ కాజల్, డీఎస్పీలు వై.శృతి, విజయ్‌కుమార్, ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

త్రినాథస్వామి ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకుంటున్న త్రినాథస్వాములు

హిరమండలం: మండలంలోని అంబావల్లిలో త్రినాథస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలోని బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు రాధాకృష్ణ, మణికంఠ పండా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా వైశాఖ మాసంలో వచ్చే ఆదివారాల్లో త్రినాథ వ్రతాలు వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

అంబరాన్నంటిన భూలోకమాత సంబరం

ఇచ్ఛాపురం మండలం కేశుపురంలో ఆదివారం స్థానికులు భక్తిశ్రద్ధలతో భూలోకమాత సంబరం నిర్వహించారు. మేళతాళాలతో, అమ్మవారి వేషధారణతో గజముద్దను ఊరేగించారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్



ఈవీఎం రిసెప్షన్ కేంద్రాలు సిద్ధం


చిలకపాలెంలోని రిసెప్షన్ కేంద్రం


పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, అధికారులు

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపర్చే రిసెప్షన్ కేంద్రాలు చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సిద్ధం చేశారు. ఎన్నికలు ముగిశాక సోమవారం సాయంత్రం, రాత్రి వేళ ఈవీఎంలతో కూడిన వాహనాలు ఇక్కడికి చేరుకుంటాయి. ముందుగా రిసెప్షన్ కేంద్రంలో ఈవీఎంలను భద్రపర్చుతారు. అనంతరం స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు సమక్షంలో సీల్ వేస్తారు. కౌంటింగ్ వరకు భద్రపర్చుతారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికలు అధికారి మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు పర్యవేక్షించారు. – ఎచ్చెర్ల క్యాంపస్



రిసెప్షన్ కేంద్రాల రూట్ తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు